# జీవితవిస్తారం

'అమ్మాయి ఇంకా బడినుండి రాలేదు. ఫోన్‌చేస్తే వాళ్ళు అసలు ఈ రోజు అమ్మాయి బడికే రాలేదన్నారు. నాకేమిటో భయంగా వుంది', అని అరుణ ఫోన్‌లో చెప్పింది.

అలవాటు ప్రకారం 'అయితే నన్నేం చేయమంటావ్?' అని అందా మనుకుంటూనే 'నేనో పది నిముషాలలో ఇంటిదగ్గర ఉంటాను' అని సమాధానం చెప్పాడు రఘుపతి.

బడికి వెళ్ళకుండా అమ్మాయి ఇంకెక్కడికి వెళ్ళినట్లు?- అమ్మాయి వచ్చి చెబితే తప్ప సమాధానం తెలియదు.

అప్పుడే మూడున్నర అయింది.

రఘుపతి ఆఫీసు కారు తీసుకుని బయలుదేరాడు.

దారిలో పోలీస్‌స్టేషన్ దగ్గర ఆగి రిపోర్ట్ ఇచ్చివెడదామా- అని పించింది. రెండుగంటలకు తిరిగి రావలసిన అమ్మాయి మూడున్నర అయినా రాలేదంటే తల్లిదండ్రులకు ఆదుర్ద కలిగే మాటనిజమే అయినా, మూడో మనిషిమటుకు ఇట్టే సమాధానం చెబుతాడు. ఏ స్నేహితురాలి ఇంటికైనా వెళ్ళిందేమో. మరో అరగంటలో వచ్చేస్తుందిలెండి. మీరేం భయపడకండి పదిహేనోళ్ళ పిల్ల యేమయిపోతుంది?- అని.

అస్సలు బడికేరాలేదు, అంటే తొమ్మిదిగంటలనుంచి ఎక్కడవున్నట్లు?

రఘుపతి గుర్తుచేసుకున్నాడు. తాను ఆఫీసుకు బయలుదేరుతున్నప్పుడు అమ్మాయి యింకా నిద్ర లేచిందా లేదా అని "చెక్" చేసాడు. మంచం మీద కనబడలేదు. ఓహో, అయితే లేచిందన్నమాట, సరే- మంచిదే అని తనదారిని తాను వెళ్ళిపోయాడు.

అరుణ తనను ఆఫీసుకు పంపిన తర్వాత అమ్మాయికి అన్నంపెట్టి బడికి పంపుతుంది. ఈరోజూ అలాగే జరిగి వుంటుంది, అందులో యేమీ సందేహం లేదు.

ఆలోచించుకుంటూనే అరగంటలో ఇంటిముందు ఆగాడు. అరుణ అతనికోసం ఎదురుచూస్తోంది. 'వచ్చింది కదూ?' అని అడిగాడు. ప్రశ్న అడగడం అనవసరం అని అరుణ ముఖం స్పష్టంగా చెబుతూనే వున్నాకూడా.

అరుణ అతనికి దగ్గరగా వచ్చింది. రెండు చేతులలోనికి అతని రెండు చేతులూ తీసుకుంది. 'త్వరగా వెదకండి ఎక్కడికి వెళ్ళిందో చిట్టితల్లి! ఒడికి మళ్ళీ ఫోన్ చేసాను. రాలేదు గాక రాలేదు అన్నారు వాళ్ళు' అందిఆదుర్దగా.

'ఎక్కడని వెదకడం?'అన్నాడు అర్థస్వగతంగా. అమ్మాయి స్నేహితుల యిళ్ళు ఈ చుట్టుప్రక్కల ఎక్కడ ఉన్నాయో నెమరకు తెచ్చుకుంటూ.

ఇంతలో టెలిఫోన్ మోగింది.

"చూడండి.... ఎలాంటి వార్త వినవలసివస్తుందో!" అంది అరుణ గుడ్లలో నీళ్లు కుక్కుకుంటూ.

రఘుపతి రిసీవర్ చేతిలోనికి తీసుకున్నాడు. అతనేమైనా మాట్లాడ టానికి ముందే అవతలి గొంతు పలికింది. "రఘుపతి ఇల్లేనా ? నేను విశ్వనాధరావును.... నన్ను మీరు ఎరగరు!"

"సరే మీకు యేం కావాలి?" అన్నాడు రఘుపతి.

'నాకు తెలుసు, మీరు ఆదుర్దపడుతూ వుంటారని. రఘుపతిగారేనా మాట్లాడుతున్నదీ ? అయిదు అవుతేగాని యింటికి రారని చెప్పిందికూడా అమ్మాయి. ఇవాళ త్వరగా వచ్చేశారా?'

'ఏమిటీ సోది? మీరెవరు? ఎక్కడనుండి?' అనడిగాడు రఘుపతి. అతనికి చిరాగ్గా వుంది. అయినా కంఠస్వరంలో ఈ చిరాకు కనబడకుండా జాగ్రత్తపడ్డాడు.

'అయాం సారీ, సర్, నేనెవరో మీకు చెప్పలేదుకదా! నాపేరు విశ్వ నాధరావు. ఆస్పత్రినుంచి ఫోన్ చేస్తున్నాను. మీ అమ్మాయి కరుణ ఉదయం నుంచి మా దగ్గరే వుంది.

"బాగా దెబ్బలు తగిలాయా?" అన్నాడు రఘుపతి, కంగారుపడిపోయి.

"దెబ్బలా? దెబ్బలెందుకండీ?"

"అమ్మాయికి ప్రమాదం జరిగిందా? రోడ్ ఏక్సిడెంటా ? మీరు

ఆఫీసుకు వెడుతూ గమనించి అమ్మాయిని ఆస్పత్రిలో చేర్చారా? చాలా థాంక్స్" అన్నాడు రఘుపతి యింకా కంగారుగానే.

"అయ్యొయ్యో.... అదేం కాదండీ! నామాట వినరేం? మీ అమ్మాయి కరుణ నవరత్నఖచితంలా వుంది. వంటిమీద చిన్న చార అయినా గీత అయినాలేదు. ఉదయం నుంచి మాతోనే ఆసుపత్రిలో ఉంది" అన్నాడు అవతలి మనిషి.

రఘుపతి రిసీవర్ మూసి, అరుణతో చెప్పాడు ఈ చల్లటి వార్త. ఆమె ఫోన్‌లో సంభాషణంతా వింటూనే వున్నా భర్తచెప్పిన మీదటిగాని ఊరట పడలేదు. "దేవుడు దయామయుడు!" అని హాయిగా ఆకాశం వైపు ఓ నమస్కారం పడేసి సోఫాలో కూలబడిపోయింది.

రఘుపతి టెలిఫోన్‌లో మాట్లాడాడు.."హలోసర్! అయితే య్యేమంటారు? అమ్మాయిని మాట్లాడమనండి ... అ, ఎందుకు, నేనే వచ్చేస్తాను. ఏ ఆసుపత్రి చెప్పండి?".

"రామారావు పేటలో జయశీల మెటర్నిటీహోం. మూడురోజుల నుంచి యిక్కడేగా వున్నాం మేం. మీరు వచ్చేస్తారా? లేకపోతే, చీకటి పడేలోగా తీసుకువస్తే సరిపోతుందంటారా?.... అయినా నేను యిక్కడనుంచి కదలడం బాగుండదులెండి"

రఘుపతి వింటూనే వున్నాడుగాని, యింకా అయోమయం తొలగలేదు. అమ్మాయికి ఏమీ ప్రమాదం జరగలేదు. కులాసాగా వుంది, నిజమేకాని అవతలి మనిషి మరీ చాదస్తుడిలా వున్నాడు ఆయన చెప్పేదంతా వింటేగాని తనకు అవసరమైన సమాచారం దొరకదు.

"హలో సర్! మీరు అక్కడే వుండండి. నేను పావుగంటలో ఆస్పత్రికి చేరుకుంటాను. అమ్మాయిని అక్కడే అట్టే వుంచండి. ధైర్యం చెప్పండి. చిటుకలో వచ్చేస్తాను" అని రిసీవర్ పెట్టేసి అరుణవైపు చూసాడు. "నేను వెళ్ళి అమ్మాయిని తీసుకువస్తాను. నువ్వేం కంగారుపడకు" అన్నాడు.

"ఒక్క నిముషంలో నేనూ తయారై వస్తానండీ, ఉండండి. ఫ్లాస్క్‌లో టీ వుంది, ఓ గుక్కెడు తీసుకుందురుగాని" అంది అరుణ.

"నువ్వు ఎందుకు అరుణా! నేను వెళ్ళి వచ్చేస్తానుగా. అసలే నీరసంగా వున్నావు, దూకుడుగా వెళ్ళాలి నేను. నువ్వు తట్టుకోలేవు. అరగంటలో కరుణతోపాటు ఇక్కడ వుంటానుగా" అని ఆమెను సమాధానపరచగలిగాడు,

రఘుపతి టీ తాగి గబగబ వెళ్ళబోతూవుంటే, అరుణ 'మీరు ఆస్పత్రికి వెళ్ళి అమ్మాయిని చూడడంతోటే నాకు ఫోన్ చేసి చెప్పండి. అంతా వివరంగా కనుక్కోండి. అసలు అమ్మాయి ఆస్పత్రికి ఎందుకు వెళ్ళింది? ఇడికి ఎందుకు వెళ్ళలేదు? స్కూల్ బేగ్ అవీ ఏక్కడ పడేసింది?....' అంటూ అతనికి హెచ్చరికలు చెప్పసాగింది.

'అలాగే, అరుణా నేను అన్నీ వివరంగా తెలుసుకుంటానుగా. మరేం బెంగపడకు. నువ్వు నిదానంగా వుండు. మేం వచ్చేసరికి మంచి టిఫిన్ చేసి వుంచు ఆ!' అని హుషారుగా రఘుపతి ముందుకు కదిలాడు.

మెటర్నిటీ హెూం ముందు కారు ఆగింది.

రఘుపతి గబగబ బయటపడి రెండో ఫ్లోర్‌కు అంగం మీద చేరుకున్నాడు. వెయిటింగ్ హాల్ ముందుగా కనిపించింది. ఆ హాల్లో ఎవరూ ఆడవాళ్ళులేరు. ముగ్గురు మగవాళ్ళు మాత్రం కూర్చుని వున్నారు.

ముగ్గురూ మూడు తరాలవాళ్ళు. ఎనభై, ఏభై, పాతిక వుంటాయి వాళ్ళ వయసులు. వాళ్ళలో విశ్వనాథరావు ఎవరో? రఘుపతి ముగ్గుర్నీ పరిశీలనగాచూచి పాతికేళ్ళ యువకుడి దగ్గరకు నడుస్తూ 'విశ్వనాథరావుగారు' అన్నాడు.

'నేనండీ విశ్వనాథరావును. మీరు రఘుపతిగారే కదూ!' అన్నాడు మధ్యవయసు ఆసామీ. మనిషిని సరీగ్గా అంచనా వేయలేక పోయినందుకు నొచ్చుకున్నాడు రఘుపతి.

'థాంక్సండీ. మా అమ్మాయి కరుణ ఎక్కడ?' అతని గొంతులో కొండంత ఆదుర్దా అసహనం మూర్తీభవించి వున్నాయి.

'కూచోండి, రఘుపతిగారూ! మీ అమ్మాయికేం ఫరవాలేదు— అని చెప్పాను కదండీ. కూర్చోండి, కూర్చోండి- వస్తుంది' అన్నాడు అతను.

'ఎక్కడకు వెళ్ళిందండీ?'

'అదుగో- ఆయన లేడూ? వాళ్ళ ఆవిడ యేదో దప్పిక, దాహం అంటూ అపసోపాలు పడుతూ వుంటే, నేనుకూడా దగ్గర్లో యేదేనా రెస్టరెంట్ వుంటే రెండు ఇడ్లెను తినివస్తానని వెళ్ళింది. పాపం, అమ్మాయి.... పొద్దున్న ఎనిమిదిన్నరకు తిన్న రెండు చపాతీలేగాని ఇంకేం ఆహారం లేకుండా వుండి

పోయింది. నీరస పడుతున్నట్లు అనిపిస్తే నేనే వెళ్ళి రమ్మని పంపాను, ఒకళ్ళకు ఒకళ్ళతో వుంటారులెండి వాళ్ళు. మీరు కూర్చోండి'.

రఘుపతికి మరింత చికాకు అనిపించింది, అయినా ఎవరినీ ఏమీ అనవలసిన పనిలేదు!

'పదినిమిషాలలో వస్తున్నానని చెప్పానుగదండీ. ఇంతలో హొటలుకు వెళ్ళే పనేమిటి? మీరు అమ్మాయిని ఇక్కడే అట్టేపెట్టి వుండాల్సింది' అన్నాడు రఘుపతి.

'మీకు ఫోన్ చేయటానికి ముందే వాళ్ళిద్దరూ వెళ్ళారండీ. వచ్చేస్తూ వుంటారులెండి. కూర్చోండి.'

ఈ మర్యాదలేమిటో రఘుపతికి అస్సలు అర్థంకావడం లేదు.

ఎనభై యేళ్ళ ఆసామి అందుకున్నాడు. 'కరుణ, మీ అమ్మాయాబాబూ. చాల మంచిపిల్ల. ఈ రోజుల్లో ఇలాంటి కడిగిన ముత్యంలాంటి అమ్మాయిలు అరుదు. ఏం వినయం, ఏం మంచితనం!....'

'ఇంతకూ మా అమ్మాయి ఇక్కడకు ఎందుకు వచ్చిందండీ?' అనడిగాడు విశ్వనాధరావు, ముసలాయనను ఇగ్నోర్ చేసేస్తూ.

'అబ్బే, అమ్మాయికి ఇక్కడకు వచ్చే పనేం లేదండీ. నేనే తీసుకు వచ్చాను' అన్నాడు ఆయన.

ఈయన క్రాస్‌వర్డ్ పజిల్ లాగ మాట్లాడుతున్నాడు అనిపించింది, రఘుపతికి. కాని బొత్తిగా పరిచయంలేని మనిషిని విసుక్కుంటే ఏం బాగుంటుంది? అమ్మాయి కంట పడేంతవరకు నిదానంగా వుండడం అవసరం.

"మీరు తీసుకువచ్చారా? ఆక్సిడెంట్ అవలేదు అన్నారుగా!"

"ఆక్సిడెంట్ కాకపోయినా, ఆక్సిడెంటల్‌గానే జరిగిపోయిందండీ, అంతాను!.... అయ్యో యేం చెప్పమంటారు మా అవస్త! మూడు రోజులనుంచి మా అనసూయ ఈ ఆస్పత్రిలో నెప్పులు పడుతూవుంది. పురుడు రాదు, డాక్టర్లు ఇదిగో- అదిగో అంటారు. చివరకు నిన్న సాయంత్రం తెగించి చెప్పేశారు.... రేపు మీరు సమ్మతిస్తే...."

"విశ్వనాధరావుగారూ! క్షమించండి" అన్నాడు రఘుపతి అసహనంగా అసహాయంగా,

"అదే వస్తున్నానండీ. ఆ! ఎంతవరకు చెప్పాను?.... ఈరోజు పది గంటల వరకు పురుడు రాకపోతే సిజేరియన్ చేసి పిల్లను బయటకు తీస్తాం- అదే మంచి పని అన్నారు. ఆపరేషన్ నేను ఊ అనాలట! అయ్యా, కొస్త వయసు మీరిన మాట నిజమేననుకోండి. అయినా సిజేరియన్ కాకుండా వుంటే బాగుండునని నేను మొదటినుండి కోరుకుంటున్నాను.

"సిజేరియన్" అయినా తప్పేం లేదండీ!" అన్నాడు రఘుపతి సంభాషణను మార్చే ప్రయత్నంలో.

"తప్పు ఒప్పుల మాట కాదండీ! మాదేమో వంటరి సంసారం. అటు గాని యిటుగాని, ఆడ సహాయం లేదు. అంతా సవ్యంగా అయిపోతే ఫరవా లేదుగానీ....

"ఇంతకూ సిజేరియన్ చేయించారా?"

"అదే వస్తున్నాను. ఈరోజు ఉదయం డాక్టర్లకు నా అంగీకారం చెప్పాలి. ఆ విషయమే ఆలోచించుకుంటూ కాస్త విశ్రాంతిగా వుంటుంది గదా అని నెహ్రూ పార్క్‌లోపలకు వెళ్ళాను. పార్కులో ఎడమ చేతివయిపు రెండు నెమళ్లు వున్నాయి చూడండి. దానిమీద దిగులుగా కూర్చుని వుంది, కరుణ. మీ చిట్టితల్లిని చూడటంతోటే నాకు ప్రాణానికి ఎంతో హాయి అనిపించింది.

అమ్మయ్యా— అనుకున్నాడు రఘుపతి.

"నెహ్రూ పార్క్‌లోనా? తొమ్మిదన్నరకా? బడికిపోలేదా?"అనడిగాడు.

"బడికి ఎట్లా పోతుందండీ?" అన్నాడు విశ్వనాధరావు, మరో ఉదంతానికి నాంది పలుకుతున్నట్లుగా.

"క్షమించి.... ఎక్కువ విరామం లేకుండా చెప్పండి...." అన్నాడు రఘుపతి. నాన్చకుండా చెప్పండి. అందామనుకున్నాడుగాని, అవతలిమనిషి అనుగ్రహం మీద ఆధారపడి వున్నప్పుడు ఆ మాట అంత ఉపయోగకారి కాదని త్వరలోనే తేల్చుకోగలిగాడు.

"బడిలో వారం రోజులుగా జరుగుతున్న తతంగం చిట్టితల్లికి తట్టుకోవడం కష్టం అయిపోయింది" అన్నాడు విశ్వనాధరావు.

"వారం రోజులుగా యేం జరుగుతోంది? మాకు ఇంట్లో మాట మాత్ర

మయినా తెలియదే!"- రఘుపతికి ఇంటికి టెలిఫోన్ చేసి చెప్తానని చెప్పిన ప్రామిస్ గుర్తుకు వచ్చింది. అయినా అమ్మాయి ఇంకా కంటపడలేదు. అవతల అరుణ ఆదుర్దా పడుతూనే వుంటుంది.

రఘుపతి ముఖకవళికలు గమనించిన విశ్వనాధరావు, అలాగే అని పిస్తుందండీ, మీకు! మాటమాత్రమైనా పైకి చెప్పకుండా వారం రోజులనుంచి కరుణ మనసులో దిగులు పడిపోతూవుంది, నాకయినా ఒకపట్టాన చెప్పిందను కుంటున్నారా ? ఎంతో బతిమలాడి, లాలించి మంచి చేసుకుంటే గాని చెప్పలేదు ..."

"అసలు యేం జరిగిందండీ?"

"అయినా ఈ రోజుల్లో పిల్లలు మరీ సెన్సిటివ్ అండీ! .. మా ఆవిడకు ఆపరేషన్ చేయించడం విషయం ఎంత ఆలోచించవలసి వచ్చింది అను కున్నారు?"

ఇంతకూ సిజేరియన్ జరిగిందా?

"ఆహా! లక్షణంగా. నేను నిర్ణయం తీసుకోవటానికి, మీ అమ్మాయే కారణం. అనసూయతో మాటమాత్రమైనా చెప్పకుండా, నిర్ణయం తీసుకున్నా ననుకోండి".

"ఇంతకూ కారణం యేం చెప్పిందండీ?"

వారం రోజుల క్రితం బళ్ళో వ్యాసరచన పోటీ జరిగింది. పిల్లలను వాళ్ళకు యిష్టం అయిన విషయం మీద పదిహేనుపంక్తులు వ్యాసం వ్రాయ మన్నారట. అందరూ పిల్లిమీద, ఎలుకమీద రాస్తే .. మనఅమ్మాయిమటుకు "జీవితం" గురించి వ్రాసింది....

"అమ్మాయి మంచి భావుకురాలు అని నేనుముందే చెప్పాను కదండీ!" అన్నాడు ముసలాయన.

ఇంతలో నర్స్ వచ్చింది.

"తాతగారూ, కంగ్రాజులేజన్స్" అంది.

"చాలాథ్యాంక్సమ్మా!" అంటూ ఆయన జేబులో చేయిపెట్టి, ఇరవై రూపాయిల కాగితం తీసి నర్సుకు అందించాడు. నర్స్ అందుకుంటూ "ఇంతటితో సరిపెట్టేద్దామనుకుంటున్నారేమో, తాతగారు! మాంచి డిన్నర్ యివ్వాలి మాకు" అంది.

"అలాగేనమ్మా డిన్నర్లకేం భాగ్యం?" అన్నాడు తాతగారు.

నర్సు వెళ్ళిపోతూ, "మీ కోడలు పనసపండులాంటి కుర్రవాడిని కన్నది. టైం నోట్ చేసుకోండి. 4-42" అంది.

రఘుపతి మళ్ళీ ప్రస్తుతంలోనికి వచ్చాడు విశ్వనాథరావు. ఒకపట్టాన తేల్చే మనిషికాదని తేలిపోయింది.

"అమ్మాయి యింకా రాలేదేమండీ!"

"ఫరవాలేదండీ. ఇప్పుడేగా వెళ్ళింది. రెస్టరెంట్‌లో వున్నవన్నీ తిని పిస్తున్నారేమో పిన్నిగారు!" అన్నాడు ముసిముసిగా.

"ఇంతకూ మీకు అమ్మాయో, అబ్బాయో చెప్పారుకారు."

"మాకు అమ్మాయేనండీ! మా ఆవిడ అమ్మాయే కావాలని పట్టుపట్టింది. అందుచేత నేనూ ఒప్పుకోక తప్పలేదు! పొద్దున్న మీ చిట్టితల్లి. కనిపించి నప్పుడే నాకు రూఢి అయిపోయింది- అమ్మాయని!"

"ఇదిగో- అమ్మాయి వ్రాసిన వ్యాసరచన కాగితం, "అని ముసలాయన విశ్వనాథరావుకు అందించాడు. రఘుపతికి యివ్వమని సంజ్ఞచేస్తూ.

"ఆ! బాగా గుర్తుచేశారు. ఈ కాగితం ఇట్లాగే ఇస్తే ఆయనకేమీ అర్థం కాదు. చెబుతాను వినండి, కరుణ జీవితాన్ని గురించి, మానవ జీవితాన్ని గురించి పదిహేను లైన్లు వ్యాసం వ్రాసింది. పంతులమ్మ ఏం చేసిందను కున్నారు? అన్నిటిలోనూ కరుణ వ్రాసిన వ్యాసమే ఉత్సాహంగా వున్నదని దాన్లో నాలుగయిదు వాక్యాలు బోర్డుమీద వ్రాసేసింది. పిల్లల్లో అసూయలు, ఆకతాయతనాలు వుంటాయి కదండీ! అప్పట్నుంచి, కరుణను క్లాసుపిల్లలంతా ఆ వ్యాసంలోని మాటలతో వేళాకోళం చేయడం మొదలుపెట్టారు. అప్పటికే కరుణ చాలా"స్పోర్టివ్"గా తీసుకుందిముందు. అయినా వాళ్ళగోల భరించడం కష్టం అయిపోయింది. అందుకని ఇవేళ స్కూలుకు వెళ్ళడం మనస్కరించక దారిలో నెహ్రూపార్కు దగ్గర రెండు నెమళ్ళు వున్నాయి చూచారూ.... ఆ స్తూపం దగ్గర కూర్చుండి యింకా ఆలోచిస్తూ వుంది.... ఇంతలో నేను అటుగా వెళ్ళాను.

"బడికి పంపించక పోయారా?"

"బడి ఎక్కడికీ పోతుందండీ! జీవితంలో ఓ గొప్ప నిర్ణయం తీసుకో వలసిన నాకు ఆ వ్యాసంలో మాటలు స్ఫూర్తిని యిచ్చాయి. మీరేచూడండి.

ఇప్పుడు మీకు అర్థం అవుతుంది-" అని విశ్వనాధరావు కాగితం రఘుపతికి అందించాడు.

అతను నిదానంగా చదివాడు,

"జీవితం చాలా ప్రగాఢమైనది, సముద్రం లాంటిది.

తీరంలో నిలుచుని చూస్తే గందరగోళంగా, గంభీరంగా కనిపిస్తుంది. సముద్రంలో దూకి లోపలకుపోతే ప్రశాంతత దొరుకుతుంది. ఇంకా,లోపలకు పోతే మణులు మాణిక్యాలు దొరకుతాయి. జీవితం కూడ యింతే.

ఒడ్డున వుండి సరదాగా చూడడం చాలదు.

జీవితంలోనికి మునిగిపోవాలి. లోతుపాతులు చూడాలి. జీవితం చాలా ప్రగాఢమైనవి, ప్రశాంతమైనది ......."

రఘుపతికి యికపైన చదవవలసింది యేమీ లేదనిపించింది. ఇందులో పిల్లలు వేళాకోళం చేయవలసిన మాటలు ఏమున్నాయి?" అన్నాడు.

నిజానికి యేమీలేవు. అయినా పద్నాలుగు, పదిహేను యేళ్ళపిల్ల ఇంత లోతయిన జీవితసత్యం పలకడం అపురూపం కదండీ! అందుకనే కొంటెకుర్రాళ్ళు అమ్మాయిని ఉడికించసాగారట ...

"జీవితం లోతులు చూస్తావా? ....

జీవితంలో మునిగిపోతావా?" అంటూ. కరుణ అస్సలే సెన్సిటివ్ గర్ల్ అని చెప్పానుగదండీ, ఆ వేళాకోళాలు వెక్కిరింతలు భరించలేకపోయింది. అందుకని...."

"అమ్మాయి తప్పకుండా మేధావంతురాలు!" అన్నాడు తాతగారు.

"ఇంతకూ అమ్మాయిని మీరేం అనకండి. మెల్లిగా మరిచిపోయేట్లు చేయండి. మేం బాగా సర్దిచెప్పాం, అనుకోండి ... ఉదయం నుంచి మాతోనే వుందిగదా! మా అనసూయ పక్కనే కూర్చుని ప్రసవం అయేంతవరకు- అదే ఆ రేషన్ వరకు- గాభరా ఏమీలేదని ఊరట కలిగించిందిగదా ..." అంటూ యింకా యేదో చెబుతూ వుండగానే కరుణ, మరీ వయసుమీరిన ఆమె వెయిటింగ్ రూం లోనికి వచ్చారు.

తాతగారు వాళ్ళతో చెప్పాడు, సంతోషంగా, మనుమడు పుట్టినసంగతి.

అందరి దగ్గర సెలవు తీసుకుని వస్తూవుండగా కరుణ అన్నది.

"రేపు స్కూలుకు వెళతాను నాన్నా. ఈ రోజంతా అనసూయగారికి సహాయంగా వుండడంతోటే సరిపోయింది—" అని.

రఘుపతి "రేపుకూడా వెళ్ళొద్దులేమ్మా. రెండురోజులుపాటు మనం ముగ్గురం మీ అమ్మమ్మగారి యింటికి వెళ్ళి కులాసాగా గడిపివద్దాం" అన్నాడు.

"మూడు రోజులు పాఠాలు పోతాయి నాన్నా" అంది కరుణ.

"ఫరవాలేదమ్మా, తొమ్మిదో క్లాసేగా!...." అన్నాడు రఘుపతి, జీవితం ప్రగాఢమైనది- అన్నవాక్యం గుర్తుచేసుకుంటూ.

*